## ఘనంగా పౌరహక్కుల దినోత్సవం

బొంరాస్‌పేట్, జూలై 30 : మండలంలోని మహంతీపూర్‌లో మంగళవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఎస్సై అబ్దుల్ రవూఫ్ ఆధ్వర్యంలో ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాలపై వివరించారు. గ్రామస్తులంతా కలిసిమెలిసి ఉండాలని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కల్గించొద్దన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు మొగులయ్య, నర్సిములు, కృష్ణయ్య, వెంకటయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# శివారు పురపాలికల్లో 44 గ్రామాలు విలీనం?

- ఎన్నికల ప్రక్రియ నిలిపివేత
- కొత్తగా రెండు కార్పొరేషన్లు ఏర్పాటయ్యే అవకాశం

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

ఔటర్ రింగురోడ్డుకు ఆనుకుని ఉన్న 44 గ్రామ పంచాయతీల్లో ఎన్నికల పక్రియ నిలిపివేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. ఈ గ్రామాలను సమీపంలోని పురపాలక సంఘాల్లో విలీనం చేసే కసరత్తు మొదలు పెట్టింది పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్న విషయం తెలిసిందే. ఆగస్టు మొదటి వారంలోగా ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని ఇటీవల ప్రభుత్వం అధికారులకు ఆదేశించిన సంగతి తెలిసిందే. అయితే నగర శివార్లలోని ఔటర్ రింగురోడ్డుకు ఆనుకుని ఉన్న గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల పక్రియ చేపట్టరాదని తాజాగా ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. అయితే దీనిపై అధికారులు ఎవరూ మాట్లాడడానికి ఇష్టపడడం లేదు. కానీ గ్రామాల విలీన పక్రియపై అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. రంగారెడ్డి జిల్లా, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల పరిధిలోని ఈ గ్రామాలన్నీ కూడా ఔటర్ రింగు రోడ్డుకు ఇరువైపుల అనుకున్న గ్రామాలే. ఇందులో రంగారెడ్డి జిల్లాలో 11 గ్రామాలు ఉండగా మిగతావి మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల పరిధిలో ఉన్నాయి. ఇప్పటికే మున్సిపాలిటీగా ఉన్న ప్రాంతంలో ఎక్కువ గ్రామాలు కలిస్తే వీటిని కార్పొరేషన్ చేయాలని నిర్ణయించారు. ఇలా శివార్లలో కొత్తగా రెండు కార్పొరేషన్లు ఏర్పాటు కానున్నట్లు తెలిసింది. అయితే దీనికి ఇంకా తుది రూపు రావాల్సి ఉందని అధికార వర్గాలు తెలిపాయి.

## క్యాంటీన్‌లో పరిశుభ్రత పాటించాలి



మహిళా క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రాధికాగుప్తా

మేడ్చల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : జిల్లా కలెక్టరేట్‌లో పెట్టబోయే క్యాంటీన్‌లో పరిశుభ్రత పాటించాలని అదనపు కలెక్టర్ రాధికాగుప్తా అన్నారు. మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టరేట్‌లో ఏర్పాటు చేయబోయే మహిళా క్యాంటీన్‌ను మంగళవారం ఆమె పరిశీలించారు. స్వయం సహాయక సంఘాల మహిళలతో ఏర్పాటు చేయించే క్యాంటీన్లలో భాగంగా కలెక్టరేట్‌లో పెట్టనున్న క్యాంటీన్‌ను పరిశీలించి క్యాంటీన్‌ను కేటాయించిన గ్రూప్ సభ్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్యాంటీన్‌లో ఎంత మంది వర్కర్లు, ఎక్కడెక్కడ ఏమేం ఏర్పాటు చేయాలనే అంశాలను అడిగి తెలుసుకుని అవసరమైన సూచనలు, సలహాలు ఇచ్చారు. క్యాంటీన్ నిర్వహణ బాగా ఉండాలన్నారు. ఉద్యోగులకు, పనుల కోసం వచ్చే వారికి రుచికరమైన ఆహారాన్ని అందివ్వాలన్నారు. ఆమె వెంట డీఆర్డీవో పీడీ సాంబశివరావు ఉన్నారు.

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అనేక అంశాల్లో అభివృద్ధి వైపు దూసుకు పోతోంది. ప్రధానంగా పరిశ్రమలు ఎక్కువగా పెరుగుతుండడంతో అనేకమందికి ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. అనేక విభాగాల్లో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో జిల్లా నిలుస్తోంది. ప్రధానంగా ఉమ్మడి జిల్లా హైదరాబాద్ నగరంలో కలిసి ఉండడంతో లాభం చేకూరుతోంది. ఇక్కడ నుంచి వేల కోట్ల రూపాయల ఎగుమతులు కూడా సాగుతున్నాయి. నగర శివార్లలోని కొత్తగా నెలకొల్పిన సంస్థల వల్ల రాష్ట్ర ఖజానాకు భారీగా నిధులు సమకూరుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో దాదాపు 2లక్షల పరిశ్రమలున్నాయి. దీంతో రంగారెడ్డి జిల్లాలో తలసరి ఆదాయం, స్థూల ఉత్పత్తిలో భారీగా పెరుగుదల నమోదవుతోంది.

- ఉమ్మడి జిల్లాలో 2 లక్షల పరిశ్రమలు
- గత ఏడాది రూ.60వేల కోట్ల ఎగుమతులు
- అంతర్జాతీయ ఎగుమతుల్లో మేటి
- పౌల్ట్రీ రంగంలో అగ్రస్థానం



# ఉపాధిలో దూకుడు

## శివారు ప్రాంతాల్లో శరవేగంగా పారిశ్రామిక విస్తరణ

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

తలసరి ఆదాయం, స్థూల ఉత్పత్తిలో అగ్రస్థానంలో ఉన్న ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఉపాధితో పాటు పలు ఆర్థికాభివృద్ధి అంశాల్లో శరవేగంగా దూసుకుపోతోంది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో వేగవంతంగా జరుగుతున్న పారిశ్రామిక విస్తరణ కారణంగా రాష్ట్రంలోనే అత్యధికంగా ఇక్కడ నుంచి దేశ, విదేశాలకు ఎగుమతులు కూడా భారీగా పెరిగాయి. ఐటీ, ఫార్మా ఎగుమతులు కూడా ఈ రెండు జిల్లాల నుంచే అధికంగా జరుగుతుండడం గమనార్హం. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన సామాజిక ఆర్థిక సర్వే (2023-24)లో అనేక ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. రంగారెడ్డి జిల్లా పలు రంగాల్లో అగ్రభాగాన ఉంది. విద్య, ఆరోగ్య, ఆర్థిక, సామాజిక అంశాల్లో రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్ జిల్లాలు ముందున్నాయి. రాష్ట్రానికి అత్యధిక ఆదాయాన్ని తీసుకు రావడమే కాక కొత్త కంపెనీల ఏర్పాటు, పెట్టుబడుల్లో ముందంజలో ఉన్నాయి. ఉపాధి అవకాశాల్లో కూడా ఉమ్మడి జిల్లా అగ్రస్థానంలో నిలిచింది. నగర శివార్లలోని కొత్తగా నెలకొల్పిన సంస్థల వల్ల రాష్ట్ర ఖజానాకు భారీగా నిధులు సమకూరుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో దాదాపు 2లక్షల పరిశ్రమలు ఉన్నాయి. దీంతో రంగారెడ్డి జిల్లాలో తలసరి ఆదాయం, స్థూల ఉత్పత్తిలో భారీగా పెరుగుదల నమోదవుతోంది. తలసరి ఆదాయం, స్థూల ఉత్పత్తిలో రంగారెడ్డి జిల్లా ప్రథమ స్థానంలో ఉండగా మేడ్చల్ జిల్లా తలసరి ఆదాయంలో మూడో స్థానంలో, స్థూల ఉత్పత్తిలో నాలుగో స్థానంలో నిలిచింది. ఇక కోళ్ల, ఉత్పత్తిలో రంగారెడ్డి జిల్లా రాష్ట్రంలో అగ్రస్థానంలో ఉంది. ఉమ్మడి జిల్లాలో 2.85కోట్ల కోళ్ల ఉత్పత్తి ఉండగా రంగారెడ్డి జిల్లాలోనే 2.40 కోట్ల కోళ్ల ఉత్పత్తి ఉండడం గమనార్హం. నగర శివార్లలో ప్రభుత్వం టీజీఐఐసీ ద్వారా పలు ప్రాంతాల్లో నూతనంగా పారిశ్రామిక వాడలను అభివృద్ధి చేస్తుండడంతో ప్రతి ఏటా పారిశ్రామిక విస్తరణ శరవేగంగా సాగుతోంది. అంతర్జాతీయ విమానాశ్రయం, రీజినల్ రింగురోడ్డు ఉమ్మడి జిల్లా పరిధిలోనే ఉండడంతో సరుకు రవాణాకు అనుకూల పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వం ప్రధానంగా ప్రస్తుతం ఉన్న పారిశ్రామిక వాడలను మరింత విస్తరించడంతో పాటు శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, ఇబ్రహీంపట్నం, మంఖాల్, మహేశ్వరం, షాబాద్ తదితర ప్రాంతాల్లో ఐటీ పార్కులు, ఎంఎస్ఎంఈ పార్కులు, ఫుడ్ పార్కులు, ప్లాస్టిక్ పార్కులు, లెదర్ పార్కులను అభివృద్ధి చేస్తోంది.

### మొత్తం పరిశ్రమలు

| జిల్లా | పరిశ్రమలు |
|---|---|
| రంగారెడ్డి | 1,09,164 |
| మేడ్చల్ | 88,037 |
| వికారాబాద్ | 15,001 |

### 27.60లక్షల వంటగ్యాస్ కనెక్షన్లు

రాష్ట్రంలోనే అత్యధికంగా ఉమ్మడి జిల్లాలో 27.60లక్షల వంటగ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. పట్టణాలు క్రమేపీ విస్తరించడంతో వంట ఇంధనానికి డిమాండ్ పెరుగుతోంది. హైదరాబాద్ మహానగరంలో ఉమ్మడి జిల్లా అంతర్భాగంగా ఉన్న విషయం తెలిసిందే. నగరం విస్తరించడంతో ఉమ్మడి జిల్లాలో పట్టణ జనాభా ప్రతి ఏటా గణనీయంగా పెరుగుతోంది. ప్రతి ఏడాదీ లక్షలాది మంది దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడకు వచ్చి జీవిస్తున్నారు. ఆధునిక జీవన విధానానికి అలవాటు పడుతున్న ప్రజలు వంట ఇంధన వినియోగ విషయంలో అవగాహన పెంచుకుంటున్నారు. కట్టెలు, కిరోసిన్ పొయ్యిలకు స్వస్తి చెబుతున్నారు. వంట గ్యాస్‌ను సామాన్యులకు, పేదలకు అందుబాటులోకి తెచ్చేందుకు కొన్ని దశాబ్దాలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. అయితే గడిచిన ఏడాదితో పోలిస్తే రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో వంటగ్యాస్ కనెక్షన్లు భారీగా పెరగగా మేడ్చల్ జిల్లాలో 55వేలు తగ్గాయి. ఇక్కడ హెచ్‌పీసీఎల్ కనెక్షన్లు దాదాపు 2లక్షల వరకు తగ్గడం గమనార్హం. ఇదే సమయంలో బీపీసీఎల్, ఐఓసీఎల్ కనెక్షన్లు పెరిగాయి. మొత్తం మీద ఉమ్మడి జిల్లాలో గత ఏడాదితో పోలిస్తే 52వేల గ్యాస్ కనెక్షన్లు పెరిగాయి.

**2023-20224లో వంట గ్యాస్ కనెక్షన్లు... ఆయిల్ కంపెనీల వారీగా (లక్షల్లో)**

| జిల్లా | ఐఓసీఎల్ | హెచ్‌పీసీఎల్ | బీపీసీఎల్ | మొత్తం |
|---|---|---|---|---|
| రంగారెడ్డి | 7.81 | 3.25 | 2.33 | 13.39 |
| మేడ్చల్ | 6.29 | 2.47 | 2.70 | 11.46 |
| వికారాబాద్ | 1.39 | 0.92 | 0.44 | 2.75 |

**రాష్ట్ర సామాజిక, ఆర్థిక సర్వే 2023-24 సూచికలు ఇలా...**

| తలసరి ఆదాయం | | |
|---|---|---|
| జిల్లా | తలసరి ఆదాయం | |
| రంగారెడ్డి | రూ. 9,46,862 | |
| మేడ్చల్ | రూ. 2,95,514 | |
| వికారాబాద్ | రూ. 1,80,241 | |
| జిల్లా స్థూల ఉత్పత్తి (రూ.కోట్లలో ) | | |
| జిల్లా | స్థూల ఉత్పత్తి | |
| రంగారెడ్డి | రూ. 2,83,419 | |
| మేడ్చల్ | రూ. 88,867 | |
| వికారాబాద్ | రూ. 19,840 | |
| ఎగుమతులు | | |
| జిల్లా | సరుకుల ఎగుమతులు | శాతం |
| రంగారెడ్డి | రూ.34,249కోట్లు | 29శాతం |
| మేడ్చల్ | రూ.25,444కోట్లు | 22శాతం |
| కోళ్ల ఉత్పత్తి | | |
| రంగారెడ్డి | 2.40 కోట్లు | |
| మేడ్చల్ | 0.40 కోట్లు | |
| వికారాబాద్ | 0.05 కోట్లు | |
| వంటగ్యాస్ కనెక్షన్లు (లక్షల్లో) | | |
| జిల్లా | 2022-23 | 2023-24 |
| రంగారెడ్డి | 12.82 | 13.39 |
| మేడ్చల్ | 12.01 | 11.46 |
| వికారాబాద్ | 2.25 | 2.75 |



మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని చెత్త డంపింగ్ యార్డు

# డంపింగ్ యార్డులకు బై.. బై!

- మేడ్చల్ నుంచి చెత్త తరలింపు
- జవహర్‌నగర్ డంపింగ్ యార్డుకు చేరవేత
- తాత్కాలిక చెత్త స్టోరేజికి స్థలాన్వేషణ

మేడ్చల్ టౌన్, జూలై 30: మేడ్చల్ మునిసిపాలిటీ పరిధిలో చెత్త డంపింగ్ యార్డులకు ఇక తెరపడనుంది. ఇంటింటికి తిరిగి సేకరిస్తున్న చెత్తను ఇకపై స్థానిక డంపింగ్ యార్డులకు బదులుగా జవహర్‌నగర్ జీహెచ్ఎంసీ డంపింగ్ యార్డుకు తరలించేలా అధికారులు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం మేడ్చల్‌లో చెత్తను నిల్వచేసేందుకు రైల్వే కాలనీ సమీపంలో ఒక డంపింగ్ యార్డు, అత్వెల్లిసమీప ప్రైవేట్ స్థలంలో మరో డంపింగ్ యార్డును నిర్వహిస్తున్నారు. ఇక్కడ చెత్త వేసి దహనం చేస్తున్నారు. రైల్వే కాలనీ వద్ద ఉన్న డంపింగ్ యార్డుకు రోడ్డు లేక అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. రైల్వేట్రాక్ అవతల డంపింగ్ యార్డు ఉండటంతో మూడేళ్లుగా కొనసాగుతున్న రైల్వే అండర్ పాస్ పనులతో తరలింపు వాహనాలు రైల్వే ట్రాక్ దాటి యార్డు వద్దకు వెళ్లేందుకు మార్గం లేకుండా పోయింది. దీంతో మునిసిపల్ సిబ్బంది తంటాలు పడుతున్నారు. అత్వెల్లిలోని డంప్‌యార్డు పరిసరాల్లో రెసిడెన్షియల్ జోన్ ఉంది. ఇక్కడ పెద్ద ఎత్తున గేటెడ్ కమ్యూనిటీలున్నాయి. ఇక్కడ చెత్త డంపింగ్, నిప్పు పెట్టడంపై స్థానికులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. 24గంటలూ వస్తున్న కలుషిత పొగతో ఇబ్బందులు పడుతున్నామని, అనారోగ్యం పాలవుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల నుంచి గట్టెక్కేందుకు కౌన్సిల్ చెత్తను దూరప్రాంతానికి తరలించాలని నిర్ణయించి ఉన్నతాధికారులకు ప్రతిపాదన పంపింది. దీంతో జవహర్ నగర్ డంపింగ్ యార్డుకు మేడ్చల్ మున్సిపల్ చెత్తను తరలించేందుకు అనుమతించారు. చెత్తను తరలింపునకు అయ్యే ఖర్చును మున్సిపాలిటీ భరించాల్సి ఉంటుంది.

### రోజూ 20 నుంచి 25 టన్నుల చెత్త తరలింపు

ప్రస్తుతం ఉన్న రెండు డంపింగ్ యార్డులను మూసేస్తున్నందున రోజూ మున్సిపల్ పరిధిలో సేకరించే చెత్తను ఒకచోట నిల్వచేసి అక్కడి నుంచి భారీ వాహనాల్లో జవహర్‌నగర్‌కు తరలించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. చెత్తను డంప్ చేయడానికి స్థలం కోసం అధికారులు అణ్వేషిస్తున్నారు. ఇందుకు రెవెన్యూ శాఖ పరిధి ఉన్న స్థలాల కోసం అధికారులను సంప్రదిస్తున్నారు. అలాగే మున్సిపల్ ఉన్న స్థలాలనూ పరిశీలిస్తున్నారు. పట్టణంలో రోజూ 20-25టన్నుల చెత్త జమవుతోంది. సేకరించిన చెత్తను ఏ రోజుకారోజు జవహర్‌నగర్ డంపింగ్ యార్డుకు తరలించనున్నారు. దీంతో ఇక్కడ డంపింగ్ యార్డుల సమస్య పరిష్కారంతో పాటు పట్టణ పరిధిలో ఇక్కపై చెత్త నిల్వ ఉండదని అధికారులు పేర్కొంటున్నారు. రోజూ భారీ వాహనాల్లో రెండుమూడు ట్రిప్పుల్లో చెత్తను తరలించేలా చర్యలు తీసుకుంటున్నారు. చెత్త తరలింపునకు ఇప్పటికే జీహెచ్ఎంసీ పరిధిలోని జవహర్‌నగర్ డంపింగ్ యార్డు నిర్వాహకుల నుంచి అనుమతి పొందినట్టు కమిషనర్ నాగిరెడ్డి తెలిపారు.

# రుణమాఫీపై అపోహలొద్దు

- వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, జూలై 30: పంట రుణమాఫీపై రైతులు ఎలాంటి అపోహలకు తావు ఇవ్వొద్దని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. మంగళవారం రైతు నేస్తం పథకం కింద రెండో విడత లక్షన్నర వరకు పంటల రుణమాఫీ నిధుల విడుదల కార్యక్రమంలో రాజేంద్ర నగర్‌లోని వ్యవసాయ యూనివర్సిటీలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కార్యక్రమాన్ని కలెక్టరేట్ నుంచి కలెక్టర్, ప్రజా ప్రతినిధులు, రైతులు, ప్యాక్స్‌ల చైర్మన్లు, వ్యవసాయ అధికారులతో ఆన్‌లైన్ ద్వారా వీక్షించారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ.. రుణమాఫీ విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, రైతులకు సందేహాలు వద్దన్నారు. అర్హులైన ప్రతీ రైతులకు రుణమాఫీ వర్తిస్తుందని తెలిపారు. ప్రతీ రైతు కుటుంబానికి రూ.2లక్షల రుణమాఫీలో భాగంగా మొదటి విడత వికారాబాద్ జిల్లాలో 46,633 మందికి 256.26కోట్ల రూపాయల రుణమాఫీ అయిందన్నారు. రెండో విడత 26,438 మంది రైతులకు 262.64కోట్ల రూపాయలు విడుదల చేశామని తెలిపారు. రుణమాఫీ అయిన వారు కొత్తగా రుణాలు పొందే అవకాశం ఉందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మంచి పంటలు పండిస్తూ ఆర్థిక వృద్ధిలోకి రావాలని కలెక్టర్ ఆకాంక్షించారు. రైతుల దయవల్లే ప్రజలకు ఎన్నో అవసరాలు తీరుతున్నాయన్నారు. రుణమాఫీ విషయంలో సందేహాలుంటే వ్యవసాయ అధికారులు, బ్యాంకర్లు రైతుల సమస్యలను తెలుసుకొని నివృత్తి చేసేందుకు తోడ్పడాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతులకు రుణమాఫీ చెక్కులను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వికారాబాద్ నియోజకవర్గంలో 7,442 మంది, తాండూర్‌లో 5,376 మంది, పరిగి నియోజకవర్గంలో 6,166 మంది, కొడంగల్ నియోజకవర్గంలో 6,057 మంది రైతులకు రెండో విడత రుణమాఫీ వర్తించింది. చెక్కుల పంపిణీ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, డీఏవో గోపాల్, లీడ్ బ్యాంక్ మేనేజర్ యాదగిరి, జిల్లా సహకార అధికారి ఈశ్వరయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరమేష్, ప్యాక్స్ చైర్మన్లు సత్యనారాయణ, లక్ష్మారెడ్డి, మొగులయ్య, సంతోష్‌రెడ్డి, జయకృష్ణ, ఏవోలు, రైతులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

### చదువుకు మించిన ఆయుధం లేదు


నవాబుపేట: చదువుకు మించిన ఆయుధం లేదని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. నవాబుపేటలోని లింగంపల్లి లక్ష్మారెడ్డి గార్డెన్‌లో అక్షర చేయూత సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన 2023-24లో టెన్త్, ఇంటర్‌లలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు సన్మానం, పురస్కారాల అందజేత కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానాలను అధిరోహించాలన్నారు. తుపాకి కంటే చదువనే ఆయుధం బలమైనదన్నారు. చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య మాట్లాడుతూ.. విద్యా వ్యవస్థను మెరుగుపర్చేందుకు ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. విద్యావ్యవస్థ బలోపేతానికి తాను పాటుపడుతానన్నారు. అక్షర స్వచ్ఛంద సంస్థ చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ యాదవరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ప్రోత్సహిస్తే ఎన్నో విజయాలు సాధిస్తారన్నారు. 18మంది విద్యార్థులకు పురస్కారాలు, నగదు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ చేవెళ్ల ఇన్‌చార్జి భీమ్‌భరత్, స్వచ్ఛంద సంస్థ వైస్‌చైర్మన్ పురుషోత్తం శాస్త్రి, పీసీబీ మెంబర్ సత్యనారాయణరెడ్డి, డీఈవో రేణుకాదేవి, తహసీల్దార్ జయరాం, ఎంపీడీవో అనురాధ, ఎంఈవో గోపాల్, మాజీ ఎంపీటీసీ భీమ్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటయ్య, వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నాగిరెడ్డి, వివిధ పాఠశాలల హెచ్ఎంలు రామకృష్ణారెడ్డి, పాండు, శివకుమార్, చంద్రశేఖర్, మాజీ సర్పంచ్‌లు వెంకట్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రాములు, అనితారంగారెడ్డి, సామా వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

మేడ్చల్(ఆంధ్రజ్యోతి): రుణమాఫీపై రైతులు సందేహపడాల్సిన అవసరం లేదని మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టర్ గౌతమ్ అన్నారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో రైతులకు రుణమాఫీ చెక్కులను కలెక్టర్ అందజేశారు. రూ.1.5లక్షల వరకు పంటరుణం ఉన్న రైతులకు రుణమాఫీ అయిందన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులు రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో భాగస్వాములు కావాలని, చిన్న చిన్న సాంకేతిక ఇబ్బందులతో రుణమాఫీలో ఆటంకాలు ఏర్పడితే ఆందోళన చెందొద్దన్నారు. అర్హులందరికీ రుణమాఫీ తప్పక చేస్తామన్నారు. రుణమాఫీకి బ్యాంకుల అధికారులు అందిస్తున్న సహకారం గొప్పదన్నారు. జిల్లాలో రెండో విడతో 886మంది రైతులకు రూ.7.15కోట్లు మాఫీ అయ్యాయన్నారు. లోన్ మాఫీ అయిన రైతులకు బ్యాంకు అధికారులు తిరిగి వెంటనే రుణాలివ్వాలన్నారు. రుణమాఫీ డబ్బు రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో డీఏవో మేరీరేఖ, అదనపు కలెక్టర్‌లు రాధికా గుప్తా, విజయేందర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.



రైతులకు చెక్కు అందజేస్తున్న మేడ్చల్ కలెక్టర్ గౌతమ్



## భూములను సీసీఐ పేరిట మార్చాలి

తాండూరు రూరల్, జూలై 30: మండలంలోని కరన్‌కోట్ గ్రామ శివారులోని సీసీఐ కర్మాగారానికి 1977-78లో ప్రభుత్వం 1,600 ఎకరాలు భూమిని కొనుగోలు చేసిందని, ఆ భూములన్నీ రెవెన్యూ రికార్డుల్లో ఇప్పటికీ రైతుల పేరిటే ఉన్నాయని పీఎన్‌డీ హెచ్‌ఆర్ అమిత్‌రంజన్ తెలిపారు. ఆ భూముల యజమానిగా వెంటనే రైతుల పేర్లను తొలగించి సీసీఐ పేరుపై మార్చాలని తాండూరు తహసీల్దార్ తారాసింగ్‌ను కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన తహసీల్దార్‌కు భూముల సర్వే నంబర్ల వివరాలు వెల్లడించారు. కర్మాగారం నిర్మాణం సమయంలో అప్పట్లో 1,600 ఎకరాలను రైతుల నుంచి కొనుగోలు చేశారని తెలిపారు. ఆ భూముల్లో కొన్ని ఇతరుల పేరున ఉన్నాయని, సీసీఐ కర్మాగారం యాజమాన్యం పేరున మార్పు చేసి పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వాలని కోరారు. అందుకు తహసీల్దార్ తారాసింగ్ స్పందిస్తూ.. కంపెనీ ఆధీనంలో ఉన్న భూముల సర్వే నంబర్లు, ఇతర డాక్యుమెంట్లతో రిజిస్ట్రేషన్ కోసం మీ-సేవలో స్లాట్ బుక్ చేసుకోవాలని, ఆ తర్వాత రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిచేసి కర్మాగారం పేరిట మార్పు చేస్తామని తెలిపారు. ఆయన వెంట సీసీఐ కర్మాగారం ప్రతినిధులు ఉన్నారు.

## అదనపు కలెక్టర్‌కు శుభాకాంక్షల వెల్లువ



కీసర రూరల్: అదనపు కలెక్టర్‌కు పుష్ప గుచ్ఛం అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్లు

కీసర రూరల్, జులై 30: మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు)గా బాధ్యతలు స్వీకరించిన రాధికాగుప్తను నాగారం, దమ్మాయిగూడ, పోచారం మున్సిపల్ చైర్మన్లు కౌకుంట్ల చంద్రారెడ్డి, వసుపతి ప్రణీత, బోయపాటి కొండల్‌రెడ్డిలు మంగళవారం కలెక్టరేట్‌లో ఆమెను కలిసారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగారం మున్సిపల్ కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

**శామీర్‌పేట:** అదనపు కలెక్టర్ రాధిక గుప్తను మంగళవారం అంతాయిపల్లిలోని కలెక్టరేట్‌లో శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్, మేనేజర్ శ్రావణ్‌కుమార్‌లు మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## తాండూరు ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ రవిశంకర్ బాధ్యతల స్వీకరణ



డాక్టర్ రవి శంకర్

తాండూరు, జూలై 30: తాండూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ రవిశంకర్ బాధ్యతలు చేపట్టారు. రవి శంకర్ గతంలో ఆస్పత్రి సూపరిండెంట్‌గా పనిచేశారు. ఇక్కడ పని చేసిన ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ మూర్తి మహబూబ్‌నగర్ జిల్లాకు బదిలీపైవెళ్లారు. తాండూరు ఆస్పత్రి నుంచి బషీరాబాద్ ఆస్పత్రికి బదిలీపై వెళ్లిన డాక్టర్ రవిశంకర్ డిప్యూటేషన్‌పై తిరిగి తాండూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చారు. గతంలో రవిశంకర్ సూపరింటెండెంట్‌గా ఉన్న సమయంలో తాండూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి రెండుసార్లు రాష్ట్ర స్థాయిలో కాయకల్ప అవార్డు వచ్చింది.

## రోడ్లు బాగు చేయాలి



ఆర్అండ్‌బీ డీఈకి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

వికారాబాద్, జూలై 30: కొత్తగడి నుంచి మోమిన్ పేట్ వెళ్లే రోడ్డును వెంటనే బాగు చేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు నరోత్తంరెడ్డి అన్నారు. బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్అండ్‌బీ కార్యాలయం ముందు ధర్నా చేసి డీఈకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాజేందర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, పోకల సతీష్, బొస్సా శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ కాంపిటీషన్‌లో
## మోడల్ కళాశాల విద్యార్థి ప్రతిభ

▸ ఆగస్టు 16న జపాన్‌లో జరిగే పోటీలకు ఎంపిక

చేవెళ్ల, జూలై 30 : మండల కేంద్రంలోని మోడల్ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థి శర్వజిత్ రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ కాంపిటీషన్‌లో విజయం సాధించారని ప్రిన్సిపాల్ టేనావతి తెలిపారు. హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ సైన్స్ నాలెడ్జ్ పోటీలో శర్వజిత్ ప్రతిభ కనబర్చారని చెప్పారు. రాష్ట్రస్థాయిలో నిర్వహించిన పోటీలో అత్యంత ప్రతిభ చూపడంతో ఆగస్టు 16న జపాన్‌లో జరగబోయే ఇన్‌స్పైర్ కాంపిటీషన్‌కు శర్వజిత్ ఎంపికయ్యాడని తెలిపారు. ఈమేరకు అధ్యాపకులు శర్వజిత్‌ను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

### విద్యార్థులు కంప్యూటర్ పరిజ్ఞానం
## పెంపొందించుకోవాలి

చేవెళ్ల, జూలై 30 : మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలని తెలంగాణ రాష్ట్ర మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలల రాష్ట్ర కార్యదర్శి సైదులు తెలిపారు. కాగ్నిజెంట్ మల్టీ నేషనల్ సాఫ్ట్‌వేర్ కంపెనీ ఆల్ ఇండియా, తెలంగాణ మైండ్ స్పార్క్ సంస్థ ప్రతినిధులు మంగళవారం చేవెళ్ల పట్టణ కేంద్రంలో ఉన్న గురుకుల పాఠశాలలో 20 కంప్యూటర్లతో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ యాదయ్యగౌడ్ తదితరులతో కలిసి సైదులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల కోసం ఉచితంగా 20 కంప్యూటర్లు ఏర్పాటు చేయడయం అభినందనీయమని అన్నారు. విద్యార్థులు కంప్యూటర్లను సద్వినియోగం చేసుకోవాలని, బాగా చదువుకుని ఉన్నతులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. గురుకుల పాఠశాలలోని విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రిన్సిపాల్ నర్సింలు, కాగ్నిజెంట్ సంస్థ ప్రతినిధులు మేఘ, ఆనంద్, అచ్యుత్, ఉపాధ్యాయులు, మణిమాల, హెచ్‌ఎస్ రమ్య, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

## అవసరానికి సరిపడా విద్యుత్ సరఫరా

▸ టీజీఎస్పీడీసీఎల్ చైర్మన్, ఎండీ ముషారఫ్ ఫారుఖీ



ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ముషరఫ్ ఫారుఖీ

శంషాబాద్, జూలై 30 : అవసరానికి సరిపడా విద్యుత్ సరఫరా చేయనున్నట్లు టీజీఎస్పీడీసీఎల్ చైర్మన్, ఎండీ ముషారఫ్ ఫారుఖీ అన్నారు. శంషాబాద్ మున్సిపల్ కేంద్రం ధర్మగిరిలో 33/11 కేవీ సబ్‌స్టేషన్ వద్ద 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మంగళవారం ముషారఫ్ ఫారుఖీ ప్రారంభించారు. సంస్థ ఇంజనీర్లతో పాటు సిబ్బందికి ఆయన పలు సూచనలు చేశారు. లోడు పెరిగిన చోట అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌లు కానీ, పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు కానీ.. అదనంగా నూతన లైన్లు ఏర్పాటు చేయుటకు టీజీఎస్పీడీసీఎల్ సిద్ధంగా ఉందని తెలిపారు. వేసవిలో రికార్డుస్థాయి డిమాండ్ కరెంటు సరఫరా చేయడానికి ఏర్పాట్లు చేశామన్నారు. వచ్చే ఏడాది కూడా డిమాండ్‌కు సరిపడా విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. వ్యవసాయం, పరిశ్రమలకు గృహ, వాణిజ్య అవసరాలకు సరిపడా సరఫరా చేయాలని ఆయన సూచించారు. అనంతరం సబ్‌స్టేషన్ పరిధిలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## పింఛన్ పంపిణీలో ఇష్టారాజ్యం

▸ గంటల తరబడి క్యూలో వృద్ధుల ఇక్కట్లు

▸ పోస్టల్ అధికారుల తీరుపై లబ్ధిదారుల ఆగ్రహం

మర్పల్లి, జూలై 30: ప్రభుత్వం ప్రతీనెల వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు పింఛన్ మంజూర్ చేస్తుంటే పంపిణీ చేసే పోస్టల్ అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ పింఛన్‌దారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో వారం రోజుల కిందటే పింఛన్ పంపిణీ జరిగితే మర్పల్లి మండల కేంద్రంలో మాత్రం మంగళవారం పింఛన్ పంపిణీ చేసేందుకు పోస్టల్ అధికారులు పంచాయతీ కార్యాలయానికి చేరుకోగా గత వారం రోజులుగా పింఛన్ కోసం ఎదురు చూస్తున్న లబ్ధిదారులు ఒకేసారి అక్కడికి చేరుకున్నారు. పంపిణీ చేసే పోస్టల్ అధికారులు వారి పట్ల దురుసుగా ప్రవర్తిస్తూ స్థానిక పోలీసులను పిలిపించి దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులను గంటల తరబడి క్యూలో నిలబెట్టి పింఛన్ పంపిణీ చేశారు. కొంత మంది పింఛన్‌దారులు ప్రతీనెల మాదిరిగానే పేర్లు పిలవమంటే అలా ఇచ్చేందుకు కుదరదని, క్యూలో నిలబడితేనే ఇస్తామని చెప్పడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పింఛన్ ఎందుకు ఆలస్యం అయిందని ప్రశ్నిస్తే సాంకేతిక సమస్య తలెత్తిందంటూ పొంతన లేని సమాధానం ఇచ్చారు. రూ.2016 అందించాల్సిన పింఛన్‌ను చిల్లర లేవనే సాకుతూ రూ.2వేలు మాత్రమే ఇచ్చారని పలువురు లబ్ధిదారులు వాపోయారు.

# హైవే కోసం నిర్మాణాల తొలగింపు

▸ 94 మందికి నోటీసుల జారీ

▸ పరిహారం చెల్లింపునకు సన్నాహాలు



బాధితులతో రెవెన్యూ, జాతీయ రహదారుల అధికారుల సమావేశం

మేడ్చల్ టౌన్, జూలై 30: మేడ్చల్‌లో జాతీయ రహదారి వెడల్పులో స్థలాలు/నిర్మాణాలు కోల్పోతున్న బాధితులకు పరిహారం చెల్లించేందుకు రెవెన్యూ, జాతీయ రహదారుల అధికారులు నిర్వాసితులతో సమావేశం నిర్వహించారు. మంగళవారం మేడ్చల్ మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ శైలజ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. మేడ్చల్ చెక్‌పోస్టు నుంచి పట్టణంలోని ఐటీఐ వరకు హైవేపై 73పిల్లర్లతో బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నారు. ఈ నిర్మాణంలో భాగంగా రోడ్డు వెడల్పునకు రోడ్డుకిరువైపులా ఉన్న ప్రైవేట్ స్థలాల స్వాధీనానికి అధికారులు కసరత్తు చేపట్టారు. మేడ్చల్, అత్వెల్లి, ఎల్లంపేట పరిధిలో తొమ్మిదెకరాల పైచిలుకు స్థలాల స్వాధీనానికి రంగం సిద్ధం చేశారు. రోడ్డు కోసం స్థలాలు కోల్పోతున్న 115 మందిని గుర్తించి 94 మందికి నోటీసులు జారీ చేశారు. మేడ్చల్‌లో 0.4హెక్టార్లు, అత్వెల్లిలో 1.2 హెక్టార్లు, ఎల్లంపేట పరిధిలో 2.1హెక్టార్లను స్వాధీనం చేసుకుంటామని అధికారులు ప్రకటించారు. నోటీసులు పంపిన భూ యజమానులకు ప్రభుత్వం నుంచి అందే పరిహారంపై అధికారులు చర్చించారు. యజమానులు తమ ఆస్తుల దస్తావేజులు, వివరాలతో దరఖాస్తు చేసుకుంటే పరిహారం ఇస్తారని అధికారులు బాధితులకు స్పష్టం చేశారు.

**సేఫ్ జోన్‌లో 75-100అడుగుల లోపు స్థలాలు!**

జాతీయ రహదారి పనులు ప్రారంభించిన నాటి నుంచి రోడ్డు వెడల్పులో స్థలాలు కోల్పోతున్నామంటూ టెన్షన్ పడుతున్న వారికి ఊరట లభించింది. రోడ్డుకు ఇరువైపులా 75అడుగుల లోపు స్థలాలను మాత్రమే ప్రస్తుతం అధికారులు తమ ఆధీనంలోకి తీసుకుంటూ నోటీసులుజారీ చేయడంతో రహదారికి ఆనుకొని ఉన్న స్థలాల యజమానులు ఊపిరి పీల్చుకున్నారు. మేడ్చల్‌లోని పెద్దచెరువు వాగు నుంచి అత్వెల్లి వరకు రహదారికి ఇరువైపులా చాలా నిర్మాణాలు 75-100 అడుగుల లోపే ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో 75 అడుగుల లోపు తాత్కాలిక నిర్మాణాలు ఉన్నాయి. దీంతో 75-100 అడుగుల పరిధి నిర్మాణాలు/స్థలాలు సేఫ్‌జోన్‌లో ఉన్నాయి. అధికారులు నోటీసులిచ్చిన వారిలో ముబారక్ రెస్టారెంట్ నుంచి అత్వెల్లి వైపు ఉన్నవారు ఉన్నారు. ఇక్కడున్నవన్నీ తాత్కాలిక నిర్మాణాలే కావటంతో రోడ్డు వెడల్పు పనులు సాఫీగానే కొనసాగే పరిస్థితులు కనబడుతున్నాయి. ఇదిలా ఉంటే రోడ్డు వెడల్పులో భూమి కోల్పోతున్న వారికి గజానికి ఎంత కట్టిస్తారనే దానిపై అధికారుల్లో స్పష్టత లేకపోవటం గమనార్హం.

## నిరుపయోగంగా ట్రీ గార్డులు

▸ లక్షల రూపాయలు వృథా

▸ అధికారుల అలసత్వంపై ప్రజల ఆగ్రహం



నాగారం మున్సిపల్ రాంపల్లి వార్డు కార్యాలయ ఆవరణలో నిరుపయోగంగా పడి ఉన్న టీ గ్రార్డులు

కీసర రూరల్, జూలై 30: నాగారం మున్సిపల్ అధికారులు హరితహారం నిధులను దుర్వినియోగం చేస్తున్నారు. లక్ష్య సాధనలో అలసత్వం వహిస్తున్నారు. వెరసి లక్షల రూపాయలు బూడిదలో పోసిన పన్నీరుగా మారుతోంది. అధికారుల నిర్లక్ష్యంతో ప్రజాధనంతో తయారు చేసిన వస్తువులు నిరుపయోగంగా మారుతున్నాయి. నాగారం మున్సిపల్ రాంపల్లిలోని వార్డు కార్యాలయ ఆవరణలో నిరుపయోగంగా పడి ఉన్న ట్రీ గార్డులే ఇందుకు నిదర్శనం. హరితహారంలో భాగంగా మొక్కల సంరక్షణకు తయారు చేయించిన వందలాది ట్రీగార్డులు వృథాగా కుప్పలుగా పడిఉన్నాయి. సంవత్సర కాలంగా వానకు తడుస్తూ, ఎండకు ఎండుతూ తుప్పుపడుతున్నాయి. అయినప్పటికీ అధికారుల్లో చలనం రావడం లేదు. ప్రజాధనమంటే లెక్కే లేదన్నట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు చర్చించుకుంటున్నారు. ట్రీ గార్డులు తయారు చేయించడంలో ఉన్న చొరవ వినియోగంలో లేకపోవటంతో స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ పరిధిలో హరితహారం నిర్వహణ ఇంజనీరింగ్ శాఖ అధికారుల పర్యవేక్షణలో కొనసాగుతుంది. ఆశాఖ అధికారులే గత సంవత్సరం వాటిని తయారు చేయించారు. అయితే వాటిని మొక్కల సంరక్షణకు వినియోగించడం మరిచారు. ఇంజనీరింగ్ శాఖ అధికారులు టెండర్లు, కాంట్రాక్టులు, నిర్మాణ, అభివృద్ధి పనులపై చూపిస్తున్న ఆసక్తి హరితహారంపై కనబరచడం లేదన్న ఆరోపణలూ వస్తున్నాయి. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్‌ను అడగ్గా ఈ సంవత్సరం వినియోగిస్తామని తమ తప్పిదాన్ని కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేశారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మున్సిపల్ నిధులతో తయారు చేయించిన ట్రీ గార్డులను వినియోగించాలని ప్రజలు కోరుతున్నారు.

## ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాలి

▸ సీపీఎం రాష్ట్ర నాయకుడు జాన్‌వెస్లీ

నందిగామ, జూలై 30: ప్రజా సమస్యలపై కార్యకర్తలు నిరంతరం పోరాడాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు జాన్‌వెస్లీ సూచించారు. మంగళవారం సీపీఎం రంగారెడ్డి జిల్లా శిక్షణా తరగతుల్లో భాగంగా రెండోరోజు నందిగామ మండల పరిధిలోని ఈదులపల్లి శివారులోని కాకా గెస్ట్‌హౌస్‌లో జరిగిన కార్యక్రమానికి జాన్‌వెస్లీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. భారత్ కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రజా పోరాటాల్లో కార్యకర్తల కృషి మరువలేనిదని, ప్రజా సమస్యలపై మరింత పోరాడాలన్నారు. హిందూ రాజ్య స్థాపనే లక్ష్యంగా బీజేపీ పరిపాలన చేస్తుందని ఆరోపించారు. దేశంలో మతోన్మాదం, మూఢనమ్మకాలు పెరిగిపోయాయని, దీనికి బీజేపీ ప్రతినిధిగా ఉందన్నారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ ప్రయత్నిస్తుందని, వారు అనుకున్నట్టు రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లు తొలగిస్తే దేశం ప్రమాదంలోకి వెళ్తుందని సూచించారు. సాంస్కృతిక, సామాజిక, సాంకేతికత, విద్యారంగాల్లో నైపుణ్యాలు పెంపొందించాలని, దానికనుగుణంగా ప్రభుత్వాలు పనిచేయాలన్నారు. కార్యకర్తలు బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు, బాస్కర్, రాజు, సామ్యేల్, చంద్రమోహన్, జగదీష్, యాదయ్య, శోభన్, కవిత, నర్సిరెడ్డి, అంజయ్య, శ్రీను నాయక్, ఈశ్వర్, కుర్మయ్య, వెంకటరమణ, మహమ్మద్ బాబు, లక్ష్మి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.




సీపీఎం శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న జాన్ వెస్లీ



సమావేశంలో పాల్గొన్న జ్ఞానేశ్వర్ ముదిరాజ్, నీలం మధు, గరుగు రాజు ముదిరాజ్ తదితరులు

## ముదిరాజ్‌ల పక్షపాతి సీఎం రేవంత్‌రెడ్డి

మొయినాబాద్ రూరల్, జూలై 30: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణలోని ముదిరాజులందరి పక్షపాతి అని, మనం ఐక్యంగా ఉంటేనే రాజకీయంతో పాటు అన్నిరంగాల్లో రాణిస్తామని తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కోఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అన్నారు. మండలంలోని హిమాయత్ నగర్‌లోని పీవీ కన్వెన్షన్ హాల్లో జరిగిన తెలంగాణ రాష్ట్ర ముదిరాజుల ఐకమత్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ఆసెంబ్లీ ఎన్నికల ముందు ముదిరాజ్‌లకు కార్పొరేషన్ ఏర్పాటు చేస్తానని ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న ఘనత రేవంత్‌రెడ్డిదని అన్నారు. సమాజంలో మనకంటూ ప్రత్యేక గుర్తింపు రావాలన్నా.. మన హక్కులను సాధించుకోవాలన్నా ముదిరాజులందరూ ఐక్యంగా ఉండాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ముదిరాజ్ బిడ్డలు సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎంపీపీ ఇతర స్థానాల్లో గెలిచే విధంగా కలిసి కట్టుగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి, కాంగ్రెస్ తరపున మెదక్ ఎంపీగా పోటీ చేసిన నీలం మధు, రంగారెడ్డి జిల్లా మత్స్య సహకార సంఘం ఉపాధ్యక్షుడు చిలుకూరు గరుగు రాజు ముదిరాజ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నారాయణపురం మహేందర్ ముదిరాజ్, శ్రీరాములు ముదిరాజ్, సంఘం సీనియర్ నాయకులు చిలుకూరు సదువు రాంచందర్ ముదిరాజ్, జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన ముదిరాజ్ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్డీవో శ్రీలత

## ఉపాధి పనుల్లో అక్రమాలకు తావివ్వొద్దు

కడ్తాల్, జూలై 30: జాతీయ గ్రామీణ ఉపాధి పనుల్లో అక్రమాలకు చోటివ్వొద్దని డీఆర్డీవో శ్రీలత అధికారులకు సూచించారు. పనుల్లో కూలీల సంఖ్యను పెంచి నిబంధనల మేరకు నడుచుకోవాలని కోరారు. కడ్తాల మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉపాధి హామీ పథకం 3వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక సభ నిర్వహించారు. ఎంపీడీవో సుజాత అధ్యక్షతన నిర్వహించిన సభకు డీఆర్డీవో శ్రీలత, ఏపీడీలు సుభాషిణి, సక్రియానాయక్, ఎస్ఆర్పీ వెంకన్నలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సభలో 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు చేపట్టిన ఈజీఎస్ పనులపై గ్రామాల వారిగా నివేదికను సోషల్ ఆడిట్ బృందం సభ్యులు చదివి వినిపించారు. వెలుగు చూసిన తప్పిదాలను సభ దృష్టికి తెచ్చారు. డీఆర్డీవో మాట్లాడుతూ ఆధార్ కార్డు ఆధారంగా స్థానికతను బట్టి ఈజీఎస్ జాబ్ కార్డులు ఇవ్వాలని సూచించారు. పనుల్లో ఎక్కడ పొరపాట్లకు తావివ్వకూడదని తెలిపారు. అక్రమాలు జరిగినట్లు రుజువైతే అట్టి డబ్బును రికవరీ చేయడం జరుగుతుందని చెప్పారు. వన మహోత్సవం లక్ష్యాల పూర్తికి పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది చొరవ తీసుకోవాలని శ్రీలత కోరారు. కార్యక్రమంలో ఏఈ పరమేశ్, ఏపీవో లలిత, టీఏ అంజయ్య, సద్గుణ, సుగుణ, వివిధ గ్రామాల ఈజీఎస్ క్షేత్ర స్థాయి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### తాండూరు జిల్లా ఆస్పత్రికి
## జనరల్ సర్జన్ నియామకం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తాండూరు, జూలై 30: తాండూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో జనరల్ సర్జన్ బదిలీతో 'శస్త్ర చికిత్సలకు బ్రేక్' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో మంగళవారం ప్రచురితమైన కథనానికి కలెక్టర్, జిల్యా వైద్య విధాన పరిషత్ కోఆర్డినేటర్ స్పందించారు. కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేసేందుకు ఎంఎస్ జనరల్ సర్జన్ డాక్టర్ అజయ్‌కుమార్‌ను నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. బదిలీల ప్రక్రియ పూర్తి కాగానే రెగ్యులర్ సర్జన్‌ను తాండూరు ఆస్పత్రికి డిప్యూటేషన్‌పై పంపనున్నారు. జిల్లా ఆస్పత్రిలో సర్జన్ బదిలీవల్ల శస్త్రచికిత్సలు నిలిచిపోయిన విషయాన్ని జిల్లా వైద్య విధాన పరిషత్ కోఆర్డినేటర్ డాక్టర్ ప్రదీప్‌కుమార్ వైద్యవిధాన పరిషత్ కమిషనర్, కలెక్టర్ ప్రతీక్ జైన్ దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే ఈ సమస్య తీరింది.

## రూ.40 కోట్లు కొల్లగొట్టారు!

▸ సినీ నిర్మాత బషీద్, బ్యాంకు మేనేజర్ కలిసి ఘరానా మోసం

▸ 'ఆదిత్య బిర్లా' ఖాతాల నుంచి సొమ్ములు కొల్లగొట్టిన వైనం

▸ బ్యాంకు మేనేజర్ సహా ముగ్గురి అరెస్టు

▸ రాజంపేట కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన బషీద్!

హైదరాబాద్ సిటీ, జూలై 30 : ఒక సినీ నిర్మాతతో కలిసి బ్యాంకు మేనేజర్, మరో ఉద్యోగి కుమ్మక్కై మోసపూరిత లావాదేవీలతో రూ.40 కోట్లు కొల్లగొట్టారు. ఆర్థిక మోసానికి పాల్పడిన ఈ కేసులో సినీ నిర్మాతతో పాటు బ్యాంకు మేనేజర్‌ను సైబరాబాద్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఇండస్ ఇండ్ బ్యాంకు శంషాబాద్ జోన్‌లో బ్రాంచి మేనేజర్‌గా పనిచేస్తున్న రామస్వామి, డెలివరీ మేనేజర్ రాజేశ్ అక్రమ లావాదేవీలు జరిపి బ్యాంకుకు రూ.40 కోట్లు నష్టం చేశారని బ్యాంకు జోనల్ హెడ్ మణికందన్ రామనాథన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. రామస్వామి, రాజేశ్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. వ్యాపారి, సినీ నిర్మాత అయిన షేక్ బషీద్ ప్రోద్బలంతో ఈ మోసానికి పాల్పడినట్లు గుర్తించారు. మొదటి నుంచి ఆర్థిక నేరాలకు పాల్పడే బషీద్‌కు బ్యాంకు మేనేజర్‌తో పరిచయమైంది. సులభంగా రూ.కోట్లలో డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఉన్న బషీద్.. బ్యాంకు మేనేజర్‌కు సలహా ఇచ్చాడు. ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ సంస్థకు చెందిన ఖాతాలన్నీ ఇండస్ ఇండ్ బ్యాంకులోనే ఉండడంతో అనధికారికంగా ఆ ఖాతాల్లోని డబ్బులు వేరే ఖాతాల్లోకి మళ్లించి రూ.కోట్లు కొల్లగొట్టొచ్చని చెప్పాడు. రూ.వేల కోట్ల టర్నోవర్ కలిగిన సంస్థ కావడంతో కొట్టేసిన సొమ్మును గుర్తించడానికి చాలా సమయం పడుతుందని తెలిపాడు. మోసపూరిత లావాదేవీలకు ప్రతిఫలంగా ఫార్చ్యూనర్ కార్లు బహుమతిగా ఇస్తానని హామీ ఇచ్చాడు. ఇందుకు అంగీకరించిన మేనేజర్ రామస్వామి, డెలివరీ మేనేజర్ రాజేశ్‌తో కలిసి అనధికారికంగా, సంస్థ నుంచి ఎలాంటి అనుమతులు, చెక్కులు లేకుండా మోసపూరిత లావాదేవీలు జరిపి రూ.40 కోట్లు కొల్లగొట్టినట్లు పోలీసులు తేల్చారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. 2006లో ఎస్‌బీకే ప్రొడక్షన్ హౌస్‌ను ప్రారంభించిన బషీద్.. పలు చిత్రాలకు నిర్మాతగా వ్యవహరించినట్లు పోలీసుల విచారణలో తేలింది. 2024లో జరిగిన ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లోని రాజంపేట లోక్‌సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరఫున పోటీ చేసి ఓడిపోయారు. ఆర్థిక మోసాల్లో ఆరితేరిన బషీద్‌పై ఇప్పటి వరకు పలు స్టేషన్లలో 10కి పైగా కేసులు ఉన్నట్లు గుర్తించారు.

## సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు తీర్చండి

▸ సీఎంకు పోస్టుకార్డులు పంపిన రిటైర్డ్ ఉద్యోగులు

ఘట్‌కేసర్/ఘట్‌కేసర్ రూరల్, జూలై 30: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులు సీఎం రేవంత్‌రెడ్డికి పోస్టుకార్డులను(ఉత్తరాలను) పంపించారు. సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులు మంగళవారం మండలంలోని చౌదరిగూడ, వెంకటాద్రి టౌన్‌షిప్‌లోని పోస్టాఫీసు వద్దకు చేరుకుని తమ సమస్యలను పరిష్కరించాలని రాసిన పోస్టుకార్డులను పోస్టుబాక్సులో వేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. అనేక సంవత్సరాల పాటు సరైన గాలి, వెలుతురు లేని భూగర గనుల్లోకి వెళ్లి 300మీటర్ల లోతులో ఉన్న బొగ్గును తెలికి తీస్తూ ఎంతో ఇబ్బంది పడినట్లు గుర్తుచేశారు. కానీ నేడు అతి తక్కువ పింఛన్‌తో, వయోభారంతో ఉన్న తాము కనీసం మందులను కొనుక్కోలేని స్థితిలో ఉన్నామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని, ఇదే తరుణంలో తమను సైతం ఆదుకోవాలని కోరారు. సింగరేణి రిటైర్డు ఉద్యోగులందరికీ తెల్లరేషన్‌కార్డు ఇవ్వడంతోపాటు అపరిమిత వైద్యసౌకర్యాలు, 200చదరపు గజాల ఇంటిస్థలం లేదా ఇందిరమ్మ ఇంటిని కేటాయించాలని పోస్టుకార్డులో కోరారు. ఈ కార్యక్రమంలో సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు అళవందార్ వేణుమాధవ్, కె.బీరయ్య, రాజయ్య, లక్ష్మీనారాయణ, మల్లయ్య, రఫిక్, రామరాజు, ప్రభాకర్, నాగేశ్వర్‌రావు, ప్రకాశ్ రావు పాల్గొన్నారు.

## ఆలయ చరిత్రను భక్తులకు వివరిస్తా

▸ బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

వికారాబాద్, జూలై 30: అనంతగిరి ఆలయం, అనంతపద్మనాభస్వామి చరిత్రను తన పురాణ ప్రవచనాల ద్వారా భక్తులకు వివరిస్తానని బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. ఆయన తన కుటుంబ సమేతంగా మంగళవారం అనంతపద్మనాభ స్వామిని దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో చాగంటికి ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతంపలికి స్వామివారి దర్శనం చేయించారు. ఈ సందర్భంగా చాగంటి మాట్లాడుతూ.. ఇంతటి మహత్యం కలిగిన ఆలయం దర్శన భాగ్యం కలగడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామివారి స్థల పురాణం, ఆలయ విశిష్టత గురించి వివరించారు. అనంతరం ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త ఎస్.పద్మనాభం, ఈవో నరేందర్ జ్ఞాపికను అందజేసి సత్కరించారు.

## తెలంగాణ వ్యతిరేకి ప్రధాని మోదీ

▸ సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య

కొత్తూర్, జూలై 30: ప్రధాని మోదీ తెలంగాణ వ్యతిరేకి అని, కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు మొండి చెయ్యి చూపడం, ప్రధానికి తెలంగాణ మీద ఎంత ప్రేమ ఉందో అర్థమైందని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య ఆరోపించారు. సీపీఐ కొత్తూర్, నందిగామ మండలాల నిర్మాణ కౌన్సిల్ సమావేశం మండల పరిధిలోని జేపీ దర్గా వద్ద మంగళవారం నిర్వహించారు. జంగయ్య హాజరై మాట్లాడుతూ తెలంగాణ విభజన హామీలను కూడా ప్రధాని విస్మరించారని దుయ్యబట్టాడు. కమ్యూనిస్టు పార్టీ నిర్మాణ సమన్వయ కోసం గ్రామాల్లో నాయకులు పర్యటించి ప్రజలను చైతన్యపర్చాలన్నారు. కష్టజీవుల సమస్యల సాధన కోసం గత ఎన్నోఏళ్లుగా సీపీఐ ప్రజల పక్షాన ఉండి, ఉద్యమాలు చేపట్టిందని గుర్తుచేశారు. భవిష్యతు పోరాటాలకు నాంది పలుకాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కొత్తూర్ మండల కార్యదర్శిగా ఎండీ షకీల్, నందిగామ మండల కార్యదర్శిగా గడ్డం జంగయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నాయకులు ఎల్లయ్య, మైసయ్య, అజ్మత్, శంకర్, మహముద్, లక్ష్మయ్య, సంజీవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ కార్డుల జారీ ప్రక్రియ మొదలు పెట్టాలి

తాండూరు, జూలై 30 : రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు నూతన రేషన్ కార్డులు ఇచ్చే ప్రక్రియను మొదలు పెట్టాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి కోరారు. మంగళవారం అసెంబ్లీలో బడ్జెట్‌పై ఆయన ప్రసంగించారు. ఇది అన్ని వర్గాలకు సంతృప్తికర బడ్జెట్ అన్నారు. జిల్లా వెనుకబాటు తనం, తాండూరు ప్రాంత ప్రాజెక్టులపై ప్రస్తావించారు. హైదరాబాద్‌కు కూతవేటు దూరంలో ఉన్న వికారాబాద్ జిల్లా రాష్ట్ర తలసరి ఆదాయంలో చిట్ట చివరన ఉండడం బాధాకరం అన్నారు. కోకాపేట్ ధరలు, వికారాబాద్ పరిసర ప్రాంతాల భూముల ధరల్లోని వ్యత్యాసాలను ఆయన ప్రస్తావించారు. తన నియోజకవర్గంలోని సాగునీటి ప్రాజెక్టులైన కోట్‌పల్లి, జుంటుపల్లి ప్రాజెక్టులు, అసంపూర్తిగా ఉన్న శివసాగర్, బషీరాబాద్ మండలం నవాంద్గి ఎత్తిపోత పథకాల అభివృద్ధిపై బీఆర్ఎస్ ప్రభుత్వం విస్మరించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సమాచారాన్ని సేకరించి అవసరమైన నిధులు మంజూరు చేసి ప్రాజెక్టులను అభివృద్ధి చేయాలన్నారు. కాగ్నా నదిపై చిన్నతరహా ప్రాజెక్టు నిర్మించేందుకు మంజూరు చేయాలని ముఖ్యమంత్రిని కోరారు. యాసంగి సీజన్‌లో ఈ యేడాది ఎక్కువ మొత్తంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రెండు, మూడు రోజుల్లోనే రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బు జమ చేసిన ఘనత ఈ ప్రభుత్వానిదన్నారు. కేంద్రం నుంచి పెండింగ్ బకాయిలను విడుదల చేయించడంతో ప్రభుత్వానికి రూ.315.86కోట్ల రుణభారం తగ్గిందని వివరించారు. పేద మహిళలకు రూ.500కు ఇస్తున్న గ్యాస్ సిలిండర్ పథకం ఫలితాలిస్తోందని, మహిళల ఖాతాల్లో సబ్సిడీ డబ్బు జమ అవుతోందని సభలో ఎమ్మెల్యే వివరించారు. తనను ఎమ్మెల్యేగా గెలిపించి ఆశీర్వదించిన ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు.



పరిగి: జాఫర్‌పల్లిలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న లాల్‌కృష్ణ, పరశురాం

# పంట రుణమాఫీ చరిత్రాత్మకం

● డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణప్రసాద్ ● రైతు వేదికల్లో మిన్నంటిన రుణమాఫీ సంబురాలు

పరిగి, జూలై 30: సీఎం రేవంత్‌రెడ్డి ఏకకాలంలో రెండు లక్షల పంటరుణాల మాఫీ చేయడం చరిత్రాత్మకమని డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణప్రసాద్ అన్నారు. రెండవ విడతలో లక్షన్నరలోపు రుణ మాఫీ సందర్భంగా మంగళవారం పరిగి మండలం జాఫర్‌పల్లిలో సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్కల ఫొటోలకు క్షీరాభిషేకం చేశారు. ఆగస్టు 15లోపు రెండు లక్షల రుణ మాఫీ చేస్తుందని తెలిపారు. జిల్లాకు మొదటగా లక్షలోపు 46,633 మంది రైతులకు రుణమాఫీకి రూ.256కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. రెండవ విడతలో 26438మంది రైతులకు రూ.262కోట్లు మాఫీ అయిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిగి మండల అధ్యక్షుడు బి.పరశురాంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఇ.కృష్ణ, నాయకులు కెసత్యనారాయణ, శశిధర్‌రెడ్డి, యాదయ్య పాల్గొన్నారు.

**పూడూరు:** రెండో విడత రైతు రుణమాఫీపై రైతులు హర్షం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం రెండో విడత రుణమాఫీపై సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి కార్యక్రమాన్ని రైతులు, అధికారులు వీక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్ ముదిరాజ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, అజీంపటేల్, సీనియర్ నాయకులు తాజొద్దీన్, లింగప్ప, వెంకటయ్య, అమృత్, యాదగిరి గౌడ్, మహిళా నాయకురాలు బాలమణి, డైరెక్టర్ శ్రీశైలంగౌడ్, యువజన సభ్యులు వీరేశం, నరేష్, నవీన్, వీరారెడ్డి, నర్సింహులు, రైతులు పాల్గొన్నారు.

**కులకచర్ల:** ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీని సీఎం రేవంత్‌రెడ్డి నిలబెట్టుకున్నారని డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి అన్నారు. స్థానిక రైతు వేదికలో రెండో విడత రుణమాఫీ సందర్భంగా మంగళవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో రైతులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల కార్యదర్శి గోపాల్‌నాయక్, మాజీ ఎంపీపీ అంజయ్యగౌడ్, నాయకులు జోగు వెంకటయ్యగౌడ్, సత్యనారాయణ, స్థానిక మాజీ ఎంపీటీసీ ఆనందం, జలీల్, ఎల్లన్న, కృష్ణయ్య, వెంకటేశ్, బాలకృష్ణ, చంద్రయ్య పాల్గొన్నారు.

**దోమ:** మండల కేంద్రంలోని రైతు వేదికలో రెండో విడత రుణమాఫీలో భాగంగా మంగళవారం ఏవో ప్రభాకర్‌రావు ఆధ్వర్యంలో రైతులు సంబురాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాఘవేందర్‌రెడ్డి, రాములునాయక్, లక్ష్మయ్య, హనుమయ్య, ఏఈవో కావ్య, రైతులు పాల్గొన్నారు.

**బొంరాస్‌పేట్:** కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రెండో విడత రుణమాఫీ చేయడంతో రైతులు సంబరాలు జరుపుకున్నారు. మండల కేంద్రం బొంరాస్‌పేట్, దుద్యాల రైతు వేదికల్లో మంగళవారం వ్యవసాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో రైతులు సంబురాలు జరుపుకున్నారు. బొంరాస్‌పేట్ కాంగ్రెస్ నాయకులు, రైతులు వికారాబాద్ జిల్లా కేంద్రంలో కలెక్టర్ ప్రతీక్ జైన్ చేతుల మీదుగా రుణమాఫీ చెక్కు అందుకున్నారు. రైతులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకంతో మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహులుగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, రాజేశ్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి, మెరుగు వెంకటయ్య, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

**ధారూరు:** రెండో విడత రైతు రుణమాఫీలో భాగంగా అసెంబ్లీ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంగళవారం రైతులు వీక్షించారు. ధారూరు రైతువేదికలో రైతులు సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావుల ప్రసంగాలను విన్నారు. కాగా మండలంలో 1388మంది రైతులకు రూ.1.50లక్షల రుణమాఫీ కింద రూ.14.08కోట్లు రైతుల ఖాతాల్లో జమయ్యాయని వ్యవసాయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఝాన్సీలక్ష్మీబాయి, ఏఈవో సంజూరాథోడ్, కాంగ్రెస్ నాయకులు మహ్మద్‌బాబాఖాన్, మల్లారెడ్డి, బస్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

### తాండూరులో 12,704 మందికి రుణమాఫీ

తాండూర: డివిజన్ పరిధిలోని 8మండలాల్లో రెండవ విడత రుణమాఫీ కింద 12,704మంది రైతులకు నేరుగా రైతుల జాబితాల్లోకి మంగళవారం రుణమాఫీ నిధులు విడుదలయ్యాయి. మొదటి విడత రుణమాఫీ కింద 19,250 మంది రైతులకు నిధులు విడుదల కాగా రెండవ విడత కలిపి డివిజన్‌లోని ఎనిమిది మండలాల్లో 31954మంది రైతులకు రుణమాఫీ వర్తించింది. తాండూరులో 5376 మంది రైతులకు రూ.52.93 కోట్లు, కొడంగల్‌లోని మూడు మండలాలకు కలిపి 6057 మంది రైతులకు రూ.61కోట్లు రుణమాఫీ వర్తిస్తుందని అధికారులు వివరించారు.



బొంరాస్‌పేట్: రుణమాఫీ చెక్కును అందజేస్తున్న కలెక్టర్

**యాలాల:** ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీని కాంగ్రెస్ పార్టీ తప్పకుండా నెరవేరస్తుందని యాలాల మండలం సంగెం కుర్దు మాజీ సర్పంచ్ హనుమంత్ ముదిరాజ్ అన్నారు. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం లక్షన్నర లోపు రుణ మాఫీ అయిన రైతులతో మంగళవారం యాలాల రైతులు సంబరాలు నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి యాదగిరి, మాజీ జడ్పీటీసీ సిద్రాల శ్రీనివాస్, హనుమంతు ముదిరాజ్, రైతులు పాల్గొన్నారు.

### రెండవ విడత రుణమాఫీకి ఎదురుచూపులు

మేడ్చల్ టౌన్: రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీ పథకం కింద రెండవ విడత లబ్ధిదారుల జాబితాను విడుదల చేస్తున్నట్లు ప్రకటించటంతో మంగళవారం పలువురు రైతులు స్థానిక సహకార సంఘాల వద్దకు చేరుకుని వివరాలు తెలుసుకోవటానికి తర్జనబర్జన పడ్డారు. ఇప్పటికే మండలంలోని సహకార సంఘాల కార్యాలయాల్లో మొదటి విడతలో రుణ మాఫీ పొందిన రైతుల వివరాలు నోటీసు బోర్డులపై ఏర్పాటు చేశారు. కాగా సోమవారం తిరిగి రెండవవిడత రుణమాఫీ చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించటంతో మొదటి విడతలో లబ్ధిపొందని రైతులు సహకార సంఘాల వద్దకు వచ్చి వివరాలను సేకరిస్తున్నారు. పూర్తి వివరాలు రాకపోవటంతో సహకార సంఘాలు రెండవ విడత జాబితాను నోటీసు బోర్డుపై ఏర్పాటుచేయక పోవటంతో మొదటి విడత లిస్టును చూసి తికమక పడుతున్నారు.

క్రైం కార్నర్

## రత్నాలయం చోరీ కేసులో నిందితుల అరెస్ట్

● బంగారు, వెండి ఆభరణాలు, విగ్రహం, నగదు, బైక్ స్వాధీనం



రత్నాలయంలో చోరీకి పాల్పడిన నేరస్తులు, పట్టుబడిన ఆభరణాలు, విగ్రహాలు

మూడుచింతలపల్లి, జూలై 30: శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రత్నాలయం దేవాలయంలో ఈనెల 23వ తేదీన అర్ధరాత్రి చోరీ జరిగిన విషయం తెలిసిందే. ఈ చోరీకి పాల్పడిన నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి వారిని రిమాండ్‌కు తరలించారు. శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ కోటిరెడ్డి వివరాలు వెల్లడించారు. కండ్లకోయ గ్రామానికి చెందిన నీలపు నీలయ్య, చింతాడ శ్రీను అనే యువకులు చిన్ననాటి నుంచి స్నేహితులు. వీరిద్దరూ పదోతరగతి వరకు కలిసి చదువుకున్నారు. జీవనోపాధి కొరకు గుండ్లపోచంపల్లిలోని కండ్లకోయలో స్క్రాప్ దుకాణం నడిపిస్తూ జీవనం సాగిస్తున్నారు. చెడు వ్యసనాలకు బానిసై అక్రమార్జనే లక్ష్యంగా నేరాలబాట పట్టారు. ఇళ్లలో చిన్నాచితక దొంగతనాలు చేస్తున్న వీరు పెద్దమొత్తంలో అక్రమ సంపాదన ఆర్జించడానికి దేవాలయాలను టార్గెట్ చేసుకున్నారు. ఇందులో భాగంగా శామీర్‌పేట్ మండలం అలియాబాద్ పరిధిలోని రత్నాలయం గుడిలో చోరీ చేయాలని నిర్ణయించుకున్నారు. ఈనెల 23వ తేదీన రత్నాలయంలో చొరబడి చోరీకి పాల్పడ్డారు. 10తులాల బంగారం, 13.5 కిలోల వెండి ఆభరణాలతో పాటు 60కిలోల పంచలోహ విగ్రహాలు చోరీకి గురికావడంతో శామీర్‌పేట్ పోలీసులు ఈ కేసును చాలెంజ్‌గా తీసుకున్నారు. మేడ్చల్ డీసీపీ, ఏసీపీల ఆధ్వర్యంలో ఐదు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు ముమ్మరం చేశారు. శామీర్‌పేట్ సీఐ శ్రీనాథ్ నేతృత్వంలో 400 సీసీ కెమెరాలను జల్లెడపట్టారు. ముషీరాబాద్‌కు చెందిన అస్లాం అలీ, షారీఫ్‌లకు ఆలయంలో చోరీచేసిన ఆభరణాలను, వస్తువులను విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా నమ్మదగిన సమాచారం మేరకు పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి బంగారు లక్ష్మీ అమ్మవారు లాకెట్-1, వెండి మంగళసూత్రాలు-2, వెండి ఖడ్గం-1, శఠగోపాలు-2, దండకం-1, కిరీటాలు-5, వడ్డానం-1, నాగపడిగలు-2, పంచలోహ విగ్రహాలు-4, సుదర్శన చక్రం-1, రూ.80వేల నగదుతో పాటు నాలుగు సెల్‌ఫోన్లు, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. షారీఫ్ అనే నిందితుడు పరారీలో ఉన్నాడు. ఈ నేరస్తులు రత్నాలయంతో పాటు శామీర్‌పేట్, మేడ్చల్, పేట్‌బషీరాబాగ్, జీనోమ్ వ్యాలీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని 13నేరాల్లో సుమారు రూ.70లక్షల విలువ చేసే నేరాల్లో నిందితులుగా గుర్తించినట్లు తెలిపారు. కేసును చేధించిన శామీర్‌పేట్ సీఐ శ్రీనాథ్, డీఐ నర్సింహరాజు, ఎస్ఐ మునీందర్, సిబ్బంది లాలూసింగ్, హరీష్, పాలాక్ష, మహేష్, రాజారత్నం, పెద్దయ్యలను డీసీపీ కోటిరెడ్డి, ఏసీపీ రాములు అభినందించారు. ఆలయ వ్యవస్థాపకులు వెంకటేశ్ కుటుంబసభ్యులు వేదపండితులతో ఆశీర్వచనాలు అందజేశారు.

## పొలంలోకి దూసుకెళ్లిన స్కూల్ బస్.. తప్పిన ముప్పు



పొలంలోకి దూసుకుపోయిన స్కూల్ బస్

బషీరాబాద్, జూలై 30: ప్రైవేట్ స్కూల్ బస్ రోడ్డు కింది ఉన్న పొలంలోకి దూసుకుపోయిన సంఘటన మండలంలోని నీళ్లపల్లి శివారులో మంగళవారం ఉదయం జరిగింది. బస్ రోడ్డు కిందికి దిగి ఒక వైపు ఒరిగి నిలిచిపోవడంతో విద్యార్థులకు త్రుటిలో ముప్పు తప్పింది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తాండూరులోని గౌతమి స్కూల్‌కు చెందిన మినీబస్ ఆరుగురు విద్యార్థులతో స్కూలుకు వెళ్తోంది. నీళ్లపల్లి శివారులో బస్ రోడ్డు కిందికి దూసుకుపోయి నిలిచిపోయింది. డ్రైవర్ నాగేష్ వెంటనే విద్యార్థులను బస్ నుంచి దింపాడు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఏం కాలేదు. బషీరాబాద్ ఎస్ఐ రమేష్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

## శ్రీశైలంలో యువకులకు తప్పిన ప్రమాదం

దోమ, జూలై 30: మండలంలోని దాదాపూర్ గ్రామానికి చెందిన యువకులు మాజీ సర్పంచ్ కృష్ణ, గురుచర్‌గౌడ్, ఈశ్వర్, రమేశ్‌లు శ్రీశైలం పుణ్యక్షేత్రానికి వెళ్లారు. కృష్ణానది డ్యాం వెనుక భాగంలో స్నానం చేస్తుంగా నాలుగో గేటు తెరవడంతో వరద ఉధృతి పెరిగింది. దీంతో అప్రమత్తమైన యువకలు నదిలో నుంచి బయటకు వచ్చారు. ఈ సంఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఓకారు నీటితో ఇరుక్కుపోవడంతో దాదాపూర్ గ్రామానికి చెందిన యువకులు నదిలో నుంచి కారును బయటకు తీశారు.

## శామీర్‌పేట చెరువులో వ్యక్తి మృతదేహం లభ్యం

మూడుచింతలపల్లి, జూలై 30: శామీర్‌పేట్ చెరువులో మంగళవారం ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు స్థానిక పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శామీర్ పేట్ చెరువులో వ్యక్తి మృత దేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి కాప్రాకు చెందిన పున్నంపల్లి రామకృష్ణ (45)గా గుర్తించారు. అతడి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. అనంతరం మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## వివాహిత అదృశ్యం



సునీత

కులకచర్ల, జూలై 30: వివాహిత అదృశ్యమైన సంఘటన చౌడాపూర్ మండల పరిధిలోని మల్కాపూర్ పంచాయతీ పరిధిలోని గుమ్మలమ్మ తండాలో జరిగింది. తండాకు చెందిన పవన్‌కు భార్య సునీత, ఓ కుమారుడు, కూతురు ఉన్నారు. స్థానికంగా ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్నాడు. పవన్ సోమవారం పనినిమిత్తం కొందుర్గుకు వెళ్లగా భార్య, కూతురు ఇంటి దగ్గరే ఉన్నారు. భార్య సునీత మధ్యాహ్న సమయంలో కూతురిని ఇంటి దగ్గరే ఉంచి బయటకు వెళ్లింది. సాయంత్రం అయినా తిరిగి రాలేదు. ఆమె ఆచూకీ కోసం బంధువులు, ఇతరుల దగ్గర వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం పాలమూర్ జిల్లా నవాబుపేట పోలీస్‌స్టేషన్‌లో పవన్ ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## బాలుడితో పనులు చేయిస్తున్న వ్యాపారిపై కేసు

ఘట్‌కేసర్ రూరల్, జూలై 30: బాలుడితో పనిచేయిస్తున్న ఓ కూరగాయల వ్యాపారిపై ఘట్‌కేసర్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ సైదులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధి ఈడబ్ల్యుఎస్ కాలనీలో కూరగాయాల దుకాణం నిర్వహిస్తున్న పసుపులేటి శ్రీనివాస్(44) తన షాప్‌లో ఓ బాలుడు(16)తో పని చేయిస్తున్నాడు. విషయం తెలుసుకున్న ఆపరేషన్ ముస్కాన్ సభ్యులు దుకాణంపై దాడిచేసి బాలకార్మికుడికి విముక్తి కల్పించారు. దుకాణం యజమాని శ్రీనివాస్‌ను పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## రిసార్ట్‌పై దాడి.. ఇద్దరిపై కేసు నమోదు

ఘట్‌కేసర్ రూరల్, జూలై 30: అనుమతి లేకుండా పార్టీ నిర్వహిస్తున్న ఓ రిసార్ట్‌పై ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీసులు దాడిచేశారు. మద్యాన్ని స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఘట్‌కేసర్ మండలంలోని అంకుషాపూర్‌లోని ది కాంటినెంటల్ రిసార్ట్‌లో సోమవారం అర్ధరాత్రి అనుమతి లేకుండా పార్టీ జరుగుతున్న విషయం తెలుసుకున్న మేడ్చల్- మల్కాజ్‌గిరి జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, స్థానిక ఎక్సైజ్ పోలీసులు సంయుక్తంగా దాడిచేశారు. ఈ దాడిలో ఏడు మద్యం బాటిళ్ల, బీరుసీసాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. పార్టీలో బుల్లితెర నటులు, సెలెబ్రెటీలు ఉన్నట్లు సమాచారం. ఇదే విషయమై ఎక్సైజ్ పోలీసులను వివరణ కోరగా అనుమతి లేకుండా పార్టీ నిర్వహిస్తున్న రిసార్ట్ మేనేజర్, ఈవెంట్ నిర్వాహకుడిపై కేసు నమోదు చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు.

## ఆర్టీసీ బస్సులోనే సురక్షిత ప్రయాణం

తాండూరు, జూలై 30: ఆర్టీసీ బస్సులోనే సురక్షితంగా ప్రయాణం చేయవచ్చని ఆర్టీసీ తాండూరు డీఎం సురేష్‌కుమార్ తెలిపారు. స్థానిక ఆర్టీసీ డిపోలో మంగళవారం ప్రమాదరహిత వారోత్సవాలు, వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రైవింగ్‌లో ఉత్తమ ప్రతిభ కలిగిన వారిని సన్మానించారు. డిపో ఆవరణలో సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐలు ఫూల్ సింగ్, ఆనంద్, ఏడీసీలు ఉన్నారు.

**మేడ్చల్ టౌన్:** మేడ్చల్ ఆర్టీసీ డిపోలో విధులు నిర్వహిస్తున్న కార్మికులను డిపో మేనేజర్ సుధాకర్ మంగళవారం ప్రగతిచక్రం పురస్కారంతో సన్మానించారు. జూన్ నెలలో అత్యధిక ఇంధనం ఆదా చేసిన డ్రైవర్లకు, అత్యధిక ఇన్సెన్‌ట్యూవ్ పొందిన కండక్టర్లకు పురస్కారం అందజేసి సన్మానించారు. అదేవిధంగా విద్యలో ప్రతిభ కనబరిచిన కార్మికుల పిల్లలను సన్మానించారు. డిపో ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డిపో అసిస్టేట్ మేనేజర్ జి.రామారావు, అసిస్టెంట్ ఇంజినీర్ స్నేహలత, ఆఫీస్ సూపరింటెండెంట్ సత్యనారాయణ పాల్గొన్నారు.

## గురుకులం సీట్లకు దరఖాస్తు చేసుకోవాలి

కులకచర్ల, జూలై 30: బండవెల్కిచర్ల గిరిజన గురుకుల బాలుర ఉన్నత పాఠశాల, కళాశాలలో ఖాళీగా ఉన్న సీట్ల కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ గంగారం మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతిలో రెండు, ఆరవ తరగతిలో రెండు, ఎనిమిదో తరగతిలో ఏడు, తొమ్మిదో తరగతిలో ఐదు, ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంపీసీలో 11, బైపీసీలో 22 సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఆగస్టు 1వ తేదిన ఉదయం 10 గంటలకు జరిగే స్పాట్ అడ్మిషన్‌లకు విద్యార్థులు ధ్రువపత్రాలతో హాజరు కావాలని కోరారు.

**శామీర్‌పేట:** శామీర్‌పేటలోని జగద్గిరిగుట్ట గురుకుల మహిళా డిగ్రీ కళాశాల్లో ప్రత్యేకంగా ఎస్సీ విద్యార్థులకు గానూ అడ్మిషన్లు కల్పిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఇష్రత్ తెలిపారు. ఆమె మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. తమ మహిళ డిగ్రీ కళాశాల్లో బీకాం సీఏ, బీకాం బీఏ, బీజెడ్సీ, ఎంజెడ్సీ, ఎంఎస్‌సీఎస్, ఎంఎస్‌డిఎస్ గ్రూపుల్లో చేరడానికి అడ్మిషన్లు కల్పిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

**తాండూరు రూరల్:** జినుగుర్తిలోని తెలంగాణ గిరిజన సంక్షేమ బాలికల పాఠశాల, కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు జరుగుతున్నాయని ప్రిన్సిపాల్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 5, 6, 7, 8, 9, ఇంటర్ మొదటి సంవత్సరంలో గిరిజన విద్యార్థులకు అడ్మిషన్లు జరుగుతున్నట్లు వివరించారు. ఆగస్టు 1వ తేదీన ధృవీకరణ పత్రాలతో హాజరవ్వాలన్నారు.

## పంచాయతీ కార్యదర్శికి సన్మానం

కులకచర్ల, జూలై 30: హన్మ్యనాయక్ తండా పంచాయతీ కార్యదర్శి శోభారాణి బదిలీపై వెళ్లడంతో మంగళవారం సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ చందర్, తండావాసులు పాల్గొన్నారు.

### నూతన ఎంపీవోకు..

**కొడంగల్ రూరల్:** కొడంగల్ నూతన ఎంపీవో జైపాల్‌రెడ్డిని పంచాయతీ కార్యదర్శులు సన్మానించారు. ఇక్కడ పని చేసిన ఎంపీవో శ్రీనివాస్ బదిలీపై తాండూర్‌కు వెళ్లడంతో ఆయన స్థానంలో నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన ఎంపీవో జైపాల్‌రెడ్డిని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ఉషశ్రీ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు కె.కొండన్న, కృష్ణ, మధు, కృష్ణవేణి, సుభాన్, విజయభాస్కర్‌రెడ్డి, కృష్ణవేణి, అరుణ తదితరులు పూలమాలలు, శాలువాతో సన్మానించారు.

## కడా ప్రత్యేకాధికారిని కలిసిన సీపీఐ నాయకులు

కొడంగల్ రూరల్, జూలై 30: సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఎండీ.మహిమూద్ ఆధ్వర్యంలో సీపీఐ నాయకులు మంగళవారం కొడంగల్‌లో కడా ప్రత్యేకాధికారి వెంకటరెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా బొంరాస్‌పేట్ మండలం రేగడిమైలారం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత సమస్యపై వినతిపత్రం అందజేశారు. సీపీఐ నాయకులు శ్రీనివాస్, శ్యామ్‌సుందర్, రాజు, ఎండీ.రహీం పాల్గొన్నారు.

## ఆశావర్కర్ల జీతాలు పెంచాలి

శామీర్‌పేట, జూలై 30: ప్రభుత్వం ఆశావర్కర్లకు జీతాలను పెంచాలని సీఐటీయూ ఆధ్వర్యంలో శామీర్‌పేటలోని ప్రధాన చౌరస్తాలో ఆందోళన చేశారు. మండలంలోని ఆశావర్కర్లు మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే దిగివచ్చి ఆశావర్కర్లకు కనీస వేతనంగా రూ.26వేలను ప్రకటించి వెంటనే ఇవ్వాలన్నారు. ఆందోళనకారులను పోలీసులు స్టేషన్‌కు తరలించారు.

## అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

యాలాల, జూలై 30: అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గప్ప అన్నారు. పంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని చలో ఇందిరాపార్కు ధర్నా కార్యక్రమానికి హైదరాబాద్ బయలుదేరుతున్న కార్మికులను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో షబ్బీర్, మొగులయ్య, రమేష్ పాల్గొన్నారు.

**తాండూరు:** తాండూరు నుంచి సీఐటీయూ ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్లారు.

# అమ్మోర్లకు బోనం



పెద్దేముల్: బోనాలతో బయలుదేరిన మహిళలు

వికారాబాద్, జూలై 30: ఆషాడ మాస బోనాల సందర్భంగా వికారాబాద్ పట్టణంలోని మద్గుల్ చిట్టంపల్లి, రామయ్యగూడలో బోనాలను మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు బోనాలు తీసుకుని ఊరేగింపుగా వెళ్లి గ్రామ దేవతలకు నైవేద్యాలు సమర్పించారు. ఈ వేడుకల్లో గ్రామపెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

**బంట్వారం:** మండలంలోని యాచారం గ్రామంలో బోనాల పండుగను మంగళవారం వైభవంగా నిర్వహించారు. గ్రామస్తులు గ్రామంలోని పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కలు చెల్లించుకున్నారు. డప్పు వాయిద్యాలు, శివసత్తుల పూనకాల మధ్య ఉత్సవాలు నిర్వహించారు.



వికారాబాద్: రామయ్యగూడలో బోనాలతో బయల్దేరిన మహిళలు

**పూడూరు:** మండలంలోని చెన్‌గోముల్‌లో మంగళవారం ఆషాడ మాసం సందర్భంగా పోచమ్మతల్లికి బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. బోనాల ఊరేగింపుతో పోతురాజుల విన్యాసం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు యాదగిరి గౌడ్, లింగప్ప, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

● **పెద్దేముల్:** మండల కేంద్రంలో మంగళవారం బోనాల జాతరను నిర్వహించారు. కోట్ల మైసమ్మకు గ్రామస్తులు ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని మహిళలు బోనాలతో బయలుదేరి వెళ్లి పిండి వంటలతో చేసిన నైవేద్యాన్ని సమర్పించారు.

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

దౌల్తాబాద్, జూలై 30: చంద్రకల్ గ్రామంలో కొడంగల్ సీఐ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం సైబర్ మోసాలు, సీసీ కెమెరాల ప్రాముఖ్యత తదితర అంశాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. చంద్రకల్ గ్రామం కర్నాటక సరిహద్దు ప్రాంతం కావడంతో అంతరాష్ట్ర దొంగల ముఠా దొంగతనాలకు పాల్పడుతున్నారని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడంతో అనుమానాస్పద వ్యక్తులను గుర్తించడం, దొంగతనాలను అరికట్టేందుకు దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రవిగౌడ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

**ఘట్‌కేసర్ రూరల్:** అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని ఘట్‌కేసర్ సీఐ సైదులు ప్రజలకు సూచించారు. ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధి బొక్కోనిగూడ, ఎన్‌ఎఫ్‌సీనగర్, దత్తాత్రేయ కాలనీల్లో మంగళవారం సాయంత్రం ఆయన ఎస్ఐ శేఖర్‌తో కలిసి సైకిల్ పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

**బషీరాబాద్:** రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి ఆదేశానుసారం బషీరాబాద్ ఎస్ఐ రమేష్‌కుమార్ మంగళవారం స్థానిక రైల్వేస్టేషన్ కూడలిలో ఆటోలు, జీపుల డ్రైవర్లతో ప్రత్యేక సమావేశమయ్యారు. ప్యాసింజర్లను తరలించే ఆటోలు, జీపుల డ్రైవర్లు, యజమానులతో రోడ్డు ప్రమాదాల నివారణకు పలు సూచనలు చేశారు.

# మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుదాం



వికారాబాద్: పార్కులో మొక్కలు నాటుతున్న మునిసిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేష్

వికారాబాద్, జూలై 30 : మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందామని మునిసిపల్ చైర్ పర్సన్ మంజుల రమేష్ అన్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మునిసిపల్ పరిధిలోని ఏసీఆర్ కాలనీలో గల మునిసిపల్ పార్కులో మంగళవారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ జాకీర్ అహ్మద్, మునిసిపల్ మాజీ వైస్‌చైర్మన్ చిగుళ్లపల్లి రమేష్ కుమార్, కౌన్సిలర్ చందర్ నాయక్, కౌన్సిలర్లు మాలే గాయత్రి లక్ష్మణ్, మోముల స్వాతి రాజ్ కుమార్, శ్రీదేవి సదానందారెడ్డి, నాయకులు మోముల రాజ్‌కుమార్, పరశురాం నాయక్, స్థానిక నాయకులు ఆర్పీలు, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

**కులకచర్ల:** ప్రతీఒక్కరు మొక్కలను పెంచడంతో పాటు సంరక్షించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీఎస్ ఆంజనేయులు అన్నారు. మండల పరిధిలోని ముజాహిద్‌పూర్ గ్రామంలో వనమహోత్సవంలో భాగంగా మంగళవారం ఇంటింటికి ఆయన పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ చంద్రభూపాల్ రావు, గ్రామ కిమటీ అధ్యక్షుడు సర్ఫద్దీన్, కార్యదర్శి సంతోష్, నాయకులు రాములు తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్తంగా..

● **పెద్దేముల్:** తోటల పెంపకానికి దరఖాస్తు చేసుకున్న రైతులందరికీ త్వరలోనే మొక్కలు అందజేస్తామని ఎంపీడీవో జర్నప్ప తెలిపారు. మండలంలోని 14 గ్రామాల నుంచి 28మంది రైతులు తోటల పెంపకానికి ముందుకు వచ్చారని అన్నారు.

● **తాండూరు:** బీజేపీ తాండూరు పట్టణ అధ్యక్షులు మల్లేశం ఆధ్వర్యంలో మంగళవారం పట్టణ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యు.రమేష్, ముఖ్య అతిథిగా పార్టీ జిల్లా కార్యదర్శి రాముయాదవ్ పాల్గొన్నారు.

● **పెద్దేముల్:** వికారాబాద్ సమీపంలోని శ్రీసాయి దంతవైద్య కళాశాల ఆధ్వర్యంలో కందనెల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో ఉచిత దంతవైద్య శిబిరం నిర్వహించారు. 220మందికి దంతపరీక్షలు చేశారు.

● **ఘట్‌కేసర్:** పోచారం మున్సిపాలిటీ పరిధిలోని యంనంపేట్‌లో రూ.20లక్షలతో నిర్మిస్తున్న సీసీరోడ్ల నిర్మాణ పనులను మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు.

● **పూడూరు:** పీఆర్టీయూటీజీ సభ్యత్వ నమోదు వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మండల పరిధిలోని వివిధ గ్రామాల పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు.

● **మేడ్చల్ టౌన్:** రైల్వేస్టేషన్ సమీపంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళ వారం కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న తిథి భోజన్ పథకంలో భాగంగా విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రమేష్, మండల విద్యాధికారి వసంత కుమారి, హెచ్‌ఎంలు మంజుల, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● **పరిగి:** వర్షాకాలం దృష్ట్యా వివిధ కాలనీల్లో ఏర్పడిన గుంతలను పూడ్చడానికి చర్యలు తీసుకుంటామని మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్ అన్నారు. మంగళవారం జరిగిన పురపాలక పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వెంకటయ్య, మేనేజర్ నవీన్, కౌన్సిలర్లు ఉన్నారు.

● **పరిగి:** పట్టణాన్ని పరిశుభ్రతగా ఉంచడంలో కార్మికులు కీలకపాత్ర పోషించాలని పరిగి మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్, కమిషనర్ వెంకటయ్యలు అన్నారు. మునిసిపల్ కార్యాలయంలో మంగళవారం పారిశుధ్య కార్మికులకు నూనె, సబ్బులు, చెప్పులను పంపిణీ చేశారు.

● **వికారాబాద్:** బీసీల డిక్లరేషన్ పేరుతో కామారెడ్డిలో 23శాతం ఉన్న బీసీల రిజర్వేషన్లు 42శాతానికి పెంచుతామని హామీ ఇచ్చి సీఎం రేవంత్ రెడ్డి బీసీలను మోసం చేస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాదవరెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు శ్రీహరి పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్‌కు బీజేపీ నాయకులతో కలిసి రాష్ట్ర పార్టీపిలుపు మేరకు ముట్టడించి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

● **కులకచర్ల:** ఆముదాలగడ్డ కాలనీలో నిరుపేద కుటుంబానికి చెందిన మొండి సాయిలు తల్లి మంగళవారం అకాల మృతి చెందారు. విషయం తెలుసుకున్న డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి తాను అందుబాటులో లేకపోయినా పార్టీ నాయకులతో రూ.5వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు.

**బషీరాబాద్/యాలాల:** జలాల్‌పూర్‌లో తహసీల్దార్ వై.వెంకటేష్ ఆధ్వర్యంలో మంగళవారం పౌరహక్కుల దినోత్సవాన్ని మంగళవారం జరుపుకున్నారు. యాలాల మండలంలోని దౌలాపూర్‌లో ఎస్టీ హాస్టల్ వార్డెన్ వీరానందం పౌరహక్కులపై అవగాహన కల్పించారు. ఏఎస్ఐ యాదయ్యగౌడ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

**శామీర్‌పేట:** రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం పడకంటి వెంకటేశ్ చారి, రాజేశ్వరి దంపతులు ప్రత్యేకపూజలు చేసి అన్నదానం చేశారు.

● **బషీరాబాద్:** జీవన్గి, నవాంద్గీ, ఇందర్‌చెడ్ ఎత్తిపోతల పథకాలపై ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అసెంబ్లీలో సభ దృష్టికి తీసుకెళ్లడంపై బషీరాబాద్ మాజీ ఎంపీపీ కరుణ, నవాంద్గీ సొసైటీ వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్ మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. అసెంబ్లీలో ఎత్తిపోతల అంశంపై లేవనెత్తి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, రైతుల పట్ల ఎమ్మెల్యే తనకున్న ప్రేమను చాటుకున్నారని తెలిపారు.

● **బషీరాబాద్:** మండలంలోని ఎక్మాయి గ్రామానికి చెందిన మాజీ అసిస్టెంట్ వీఆర్‌వో నాగిరెడ్డి(63) సోమవారం రాత్రి గుండె పోటులతో మృతిచెందారు. రాత్రి వేళ ఇంట్లో ఉండగా తీవ్ర అస్వస్థతకు గురైన ఆయనను హైదరాబాద్‌కు అంబులెన్స్‌లో తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఎక్మాయి(పట్వారి) అసిస్టెంట్ వీఆర్‌వోగా పనిచేసిన ఆయన ఐదేళ్ల కిందట రిటైర్ అయి ఇంటి వద్ద ఉంటున్నాడు.

## సదరం క్యాంప్‌నకు విశేష స్పందన

తాండూరు రూరల్, జూలై 30: పట్టణంలోని జిల్లా ఆసుపత్రి పీపీ యూనిట్‌లో డాక్టర్ సుభాష్ చంద్రబోస్ ఆధ్వర్యంలో మంగళవారం సదరం క్యాంప్‌ను నిర్వహించారు. అయితే క్యాంపులో వైద్య పరీక్షల కోసం చెవిటి, మూగ వారు 70 మంది స్లాట్ బుక్ చేసుకోగా, శిబిరానికి 45మంది హాజరై పరీక్షలు నిర్వహించుకున్నట్లు డాక్టర్ సుభాష్ చంద్రబోస్ తెలిపారు. వారిలో 30 మంది బైరా టెస్ట్ నిర్వహించుకునేందుకు కింగ్ కోఠి ఆసుపత్రికి రెఫర్ చేసినట్లు తెలిపారు. ఈ శిబిరంలో పెద్దేముల్, యాలాల, తాండూరు, బషీరాబాద్ మండలాల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన వారు హాజరయ్యారని క్యాంప్ ఇన్‌చార్జీ శ్రీధర్ తెలిపారు.